క్లుప్తంగా

మండల కేంద్రం అయ్యేనా..?

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంటను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఎన్నికల ముందు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. భౌగోళికంగా, సామాజికంగా అన్ని రకాల వసతులతో, వనరులతో అభివృద్ధిలో ముందున్న మొండికుంటను పరిసర ప్రాంతాల్లోని ఏడు గ్రామ పంచాయతీలు 27 గ్రామాలను కలిపి మండలంగా ఏర్పాటు చేయాలన్నది డిమాండ్. దీనిపై గతంలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ వేశారు. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును కలిసి విన్నవించారు. ప్రస్తుతం, ఇటీవల ప్రభుత్వం రాష్ట్రంలో అనేక కొత్త మండలాలు ఏర్పాటు చేస్తున్న క్రమంలో మొండికుంట మండలం సాధనే లక్ష్యంగా ఎన్నికల ముందు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్షపార్టీల ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కార్మికుల సమ్మేళనం



పూర్వ కార్మికుల సమ్మేళనానికి హాజరైన కార్మికులు, వారి కుటుంబాలు

బూర్గంపాడు: ఐటీసీ పూర్వ కార్మికుల అపూర్వ సమ్మేళనం ఆదివారం స్థానిక కల్యాణి కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ కార్మిక నాయకులు పోటు రంగారావు, మారం వెంకటేశ్వరరెడ్డి, గోనె దారుగా అధ్యక్షత వహించగా.. ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ భద్రాచలం నుంచి సుమారు 2వేల మంది పూర్వ కార్మికులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి అనుభవాలను గుర్తు చేసుకుంటూ గడిపారు. అనంతరం మాజీ ఉద్యోగులను ఘనంగా సన్మానించి వారికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రదీప్ దోబ్లె, సంజయ్‌సింగ్, తదితర మాజీ ఐటీసీ ఉన్నతాధికారులు, ప్రస్తుత యూనిట్ హెడ్ సిద్ధార్థ మొహంతి, జీఎం(హెచ్‌ఆర్) శ్యాం కిరణ్, కార్మిక కుటుంబాలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

గుండాల: కేంద్ర ప్రభుత్వం గుండాల మండలాన్ని 'ఆస్పిరేషనల్ బ్లాక్'గా ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం గ్రామపంచాయతీ భవనంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్డిఎం రామిరెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకు లావాదేవీలు, పొదుపు, పెట్టుబడులు, డిజిటల్ లావాదేవీలు, సైబర్ నేరాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ఎస్‌బీఐ గుండాల శాఖ మేనేజర్ సలీం, కాచినపల్లి శాఖ మేనేజర్ శశి కుమార్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు గుండాల మేనేజర్ నాగరాజు, కౌన్సెలర్ నాగరాజు పాల్గొన్నారు.

కొలువుపై సంబురాలు



వరప్రసాద్

దుమ్ముగూడెం: మండలంలోని శ్రీనగర్ కాలనీ గ్రామానికి చెందిన పాడుతూరి వరప్రసాద్ టీఎస్‌పీఎస్ కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంతో గ్రామంలో సంబురాలు నెలకొన్నాయి. పూర్తిగా దళిత గ్రామమైన శ్రీనగర్ కాలనీలో వ్యవసాయ కుటుంబానికి చెందిన వెంకటేశ్వర్లు–గోపమ్మ కుమారుడు వరప్రసాద్. గ్రామంలో పోలీస్‌శాఖకు ఎంపిక మొదటి వ్యక్తి కూడా వరప్రసాదే. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి గ్రామానికే మొదటి సారిగా కానిస్టేబుల్‌గా ఎంపికవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి

మణుగూరురూరల్: మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామపంచాయతీ ప్రాంతంలో వాహనాల రాకపోకలతో రోడ్డుపై ఎగిసి పడుతున్న దుమ్ము, ధూళి నివారణ చర్యలు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్.మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సాంబాయిగూడెం గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతలను పూడ్చేందుకు ఇటీవలే యాష్, కంకర వాడారని, ఆ యాష్ వాహనాల రాకపోకలతో ధూళిగా లేసి వెనుక వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అర్హులకే ఇవ్వాలి

అశ్వాపురం: దళితబంధు, బీసీ బంధు అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మొండికుంటలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులకు, వారికి అనుకూలంగా ఉన్న వారికే ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తూ అధికార దుర్వినియోగానికే పాల్పడుతున్నారన్నారు. టీజేఎస్ మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సింగరేణి ఆదాయానికి గండి

- సంవత్సరాలుగా కొందరి చేతుల్లోనే సంస్థ దుకాణాలు
- నామమాత్రంగా యాజమాన్యానికి ఫీజుల చెల్లింపు
- కొందరు గుడ్‌విల్ పేరుతో దుకాణాల విక్రయం
- రూ.లక్షల్లో నష్టపోతున్న సింగరేణి



రామాలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న దుకాణ సముదాయం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కార్మిక కుటుంబాలు నివాసం ఉండే పీవీకాలనీలో కొందరు వ్యాపారులు పాతుకుపోయారు. కొన్ని దుకాణాలు సంస్థవికాగా.. మరికొన్ని అపరిచితులు నిర్మించినవి. పట్టించుకునేవారు లేకపోవడంతో బినామీలు ఏర్పడి సంస్థకు నామమాత్రపు చెల్లింపులతో సొమ్ము చేసుకుంటున్నారు. సంస్థకు రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. సింగరేణి ఆధీనంలో ఉన్న రామాలయం, శివాలయం, వెంకటేశ్వర స్వామి ఆలయాల పరిధిలో జమానాలోనే అధికారులు దుకాణాలను నిర్మించారు. ఆయా ఆలయ కమిటీలకే దుకాణాల నిర్వహణ బాధ్యతలను అప్పగించి నిర్ణయించిన సమయాల్లో ఫీజులు చెల్లించాలని నిబంధనలు ఏర్పరిచారు. ఆ పైకాన్ని ఆలయాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నది ప్రణాళిక. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. ఆలయ కమిటీల్లో కొందరు సభ్యులుగా చేరి ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఒక్కరే మూడు, నాలుగు దుకాణాలపై అజమాయిషీ చేలాయిస్తున్నారు. ఒక్కరే రెండు, మూడు ఆలయకమిటీల పరిధిలోని దుకాణాలను శాసిస్తున్నాడు. అందుకోసం బినామీ అవతారం ఎత్తుతున్నారు. ఆపై దుకాణాలను అద్దెలకు ఇచ్చి.. వచ్చే ఆదాయాన్ని మాత్రం సంస్థ పరిధిలోని ఆలయాలకు నామమాత్రంగా చెల్లిస్తున్నారు. తద్వారా ఆదాయం పక్కదారిపట్టి సింగరేణికి పరోక్షంగా నష్టం వాటిల్లినట్లవుతోంది. పైగా, ఆలయాల్లో కార్యక్రమాల నిర్వహణ కోసం సింగరేణి కార్మికల జీతాల నుంచి ప్రతినెలా రూ.100 కట్ చేస్తున్నారు. దుకాణాల ఆదాయం సవ్యంగా సంస్థకు చేరితే ఈ పరిస్థితి ఉండకపోవచ్చును.

అమ్మకాలకూ వెనకాడని వీరులు..

చాలామంది అద్దెల ఆదాయాన్ని పక్కదాని పట్టిస్తుంటే, మరికొందరు ఇంకో అడుగు ముందుకేసి ఏకంగా దుకాణాలను అమ్మకానికి పెడుతున్నారు. దుకాణం, అక్కడే ఉన్న ఇళ్లు తమదే అంటూ గుడ్ విల్ పేరుతో విక్రయాలకు తెరలేపుతున్నారు. ఇటీవల రామాలయం వద్ద ఉంచిన ఓ పాన్ డబ్బాను రూ.70వేలకు విక్రయించారని తెలిసింది. సూపర్ బజార్‌లోని సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షాపులకు 10 సంవత్సరాల్లో ముగ్గురు ఓనర్లు మారి, లక్షల్లో చేతులు మారినట్లు సమాచారం. ఇలా బయటపడని అమ్మకాల లీలలు ఎన్నో ఉన్నాయి.

సంవత్సరాలుగా టెండర్లు లేవు..

సింగరేణిలోని దుకాణాల నిర్వహణకు ప్రతీ 5 సంవత్సరాలకు ఓ సారి టెండర్లు పిలవాల్సి ఉంది. అలా జరిగితే అవకతవకలకు అవకాశం ఉండేది కాదు. ఖాళీగా ఉన్న సింగరేణీయుల పిల్లలు, రిటైర్డు ఉద్యోగులకు దుకాణాలు దక్కి ఉపాధి దొరికేది. కానీ టెండర్ల ఊసే లేదు. ఫలితంగా దుకాణాల్లో పాతవారే పాతుకుపోయారు. అక్కడితో ఆగకుండా విక్రయాలకు తెరలేపుతున్నారు. దీనికి తోడు సింగరేణి స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు వ్యక్తిగత దుకాణాలు ఏర్పరుచుకున్నారు. సంస్థ ఆస్తుల్లో ప్రైవేటు జోక్యం ఈ రకంగానూ చొచ్చుకుపోతోంది. ఈ తతంగాలన్నిటిపై యూనియన్లు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు లేవు..



సింగరేణి కార్మికులు రిటైర్డ్ అయితే క్వార్టర్ ఖాళీ చేయకపోతే గ్రాట్యుటీ నిలిపివేసే యాజమాన్యం.. ప్రైవేట్ వ్యక్తులు దశబ్దాలుగా వ్యాపారం నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదు. నామమాత్రపు అద్దెలు ఏ కొలమానం ప్రకారం తీసుకుంటున్నారో ఎవరికి ఇస్తున్నారో సింగరేణి అధికారులకు తెలియకపోవడం బాధాకరం. గత జీఎంలకు మెమోరాండంలు ఇచ్చినా చర్యలు తీసుకోలేదు.

– రాంగోపాల్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి

వివరాలు సేకరిస్తున్నాం..



సింగరేణి నిర్మించిన, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుకాణాలను కొందరు వ్యక్తులు చిన్న మరమ్మతులు చేసి ఇష్టానుసారంగా విక్రయాలు చేసుకుంటున్నట్లు మా దృష్టికి వచ్చింది. దుకాణాల్లో ఉంటున్న వారి వివరాలు సేకరించి ఉన్న వారికే కేటాయించడమా లేక టెండరింగ్ వేయడమా అన్న అంశంపై సమాలోచన చేసి నిర్ణయం తీసుకుంటాం.

– వీసం కృష్ణయ్య, ఎస్‌ఓటు జీఎం

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ ఎంపీపీ



ఎంపీపీ సోయం ప్రసాద్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మండల అధ్యక్షుడు సత్యప్రసాద్

దమ్మపేట: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన స్థానిక ఎంపీపీ సోయం ప్రసాద్, ఇతర సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. ఆదివారం మండల కేంద్రం దమ్మపేటలో కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి తుమ్మల, పొంగులేటి, ఇతర కాంగ్రెస్ నాయకుల అనుచరులు వందల సంఖ్యలో హాజరయ్యారు. సమ్మేళనంలో పార్టీలో చేరిన ఎంపీపీ మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి విజయం తథ్యమని పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్ మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అలపాటి రామచంద్రప్రసాద్, రావు గంగాధరరావు, కోటగిరి సత్యంబాబు, కక్కిరాల రమేష్, చిన్నశెట్టి యుగంధర్, యర్రగొర్ల రాధకృష్ణ, కెవి.సత్యనారాయణ, అత్తులూరి వెంకటరామారావు, పానుగంటి సత్యం, పర్వతనేని ప్రసాద్, రావు రవిశంకర్, చామర్తి గోపిశాస్త్రి, చక్కిరాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

భద్రాచలంఅర్బన్: క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అమాయక ప్రజలు, యువకులను లక్ష్యం చేసుకుని సొమ్ము చేసుకునే బెట్టింగ్ నిర్వహకులను వదిలేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఐసీసీ క్రికెట్ ప్రపంచ కప్ 2023 నేపథ్యంలో ఆయన ఈ మేరకు హెచ్చరికలు జారీ చేశారు. కాగా, భద్రాచలంలో ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్నట్టు తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఏఎస్పీ తెలిపారు.

ములకలపల్లి: క్రికెట్ బెట్టింగ్‌లు చేపట్టే నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెట్టింగులకు సహకరించినా, పాల్పడినా కేసులు నమోదు చేస్తామని అన్నారు. వీటిని నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం



అన్నపురెడ్డిపల్లి: ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు



మణుగూరుటౌన్: పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అనంతారం, కొండతోగు గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి ఆదివారం ఆరు గ్యారంటీ కార్డులపై గడపగడపకూ వెళ్లి ప్రచారం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి నాగేంద్రరావు, నాయకులు తుమ్మా రాంబాబు, కొప్పుల శ్రీను, ఉప్పల రాజశేఖర్, దాసరి రవి, అకిరిపల్లి రాంబాబు, సత్యం రామకృష్ణ, లక్ష్మణ్ నాయక్, వగ్గెల లక్ష్మణ్‌రావు, తుర్సం శ్రీను పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మండల పరిధిలోని విప్పలసింగారం, చెరువు ముందు సింగారం, సమితిసింగారంలోని వెంకటపతినగర్‌లో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విస్తృతంగా పర్యటించి గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ నెరవేర్చబోయే ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య, ఓబీ కాంట్రాక్ట్ వర్కర్ల ఆధ్వర్యంలో 50 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పాయం వెంకటేశ్వర్లు కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కేవీ రావు, గోరంట్ల కనకయ్య, సామా శ్రీనివాసరెడ్డి, వెంకట్రావ్ గౌడ్, జీవరత్నం, బాజి, తాటి భిక్షం, సుబ్బారెడ్డి, పాతూరి వెంకన్న, మధు, పాల్వంచ రాములు, రాజేశ్, చింతల కృష్ణ, బల్లెం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని రాజాపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు గడపగడపకూ కాంగ్రెస్ అభయహస్తం, గ్యారెంటీ కార్డుపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలు, బీఆర్‌ఎస్ పాలనలో కుంటుబడిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుర్రం వెంకటలక్ష్మి, పెంట్లం ఉప సర్పంచ్ తాటి రాంచంద్రరావు, ఆ పార్టీ మండలాధ్యక్షుడు వనమా గాంధీ, సీనియర్ నాయకులు బాణావత్ భీముడు, దోసపాటి రాంబాబు, చెరుకూరి రవి, ఇనపనూరి రాంబాబు, చల్లా రమేష్, బుర్గుపల్లి కృష్ణ, ముద్రగడ వెంకటేశ్వరరావు, సుభాని పాల్గొన్నారు.

తాటి పరామర్శ

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆదివారం విస్తృతంగా పర్యటించారు. పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయమందించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జహీర్, శ్రీనివాస్, శ్రీను, నవీన్, సత్యం, ముత్తయ్యలు పాల్గొన్నారు.

విజేతకు సన్మానం

మణుగూరుటౌన్: ఈ నెల 1వ తేదీన హైదరాబాద్‌లోని బాలయోగి స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ సిటిజన్ ఆటల పోటీల్లో పతకాలు సాధించిన జల్లా రవీందర్‌ను ఆదివారం రామచంద్రమిషన్ సభ్యులు పీవికాలనీలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 65 సంవత్సరాల విభాగంలో 100కె రన్‌లో మూడో స్థానం, లాంగ్ జంప్‌లో రెండో స్థానం, ట్రిబుల్ జంప్‌లో మూడు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు.

నిర్మాణాలకు శంకుస్థాపన

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ ఉడతానేనిగుంపు ప్రాంతంలో ప్రభుత్వం 40 నిరుపేద కుటుంబాల కోసం నిర్మించనున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి జెడ్పీటీసీ పోశం నరసింహారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సమితిసింగారం సర్పంచ్ బచ్చల భారతి, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, తోగ్గూడెం సర్పంచ్ బొగ్గం రజిత, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఏఎంసి డైరెక్టర్ సకిని బాబురావు, ఎంపీటీసీ బాబురావు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల కాలనీ గ్రామ పంచాయతీలో క్రీడాకారులకు ఆదివారం గ్రామ పంచాయతీ సర్పంచ్ పాయం భద్రయ్య, ఉపసర్పంచ్ ఎన్నా అశోక్ కుమార్ టీషర్టులు, వాలీబాల్, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. వార్డు సభ్యులు, క్రీడా కారులు, యువత, స్థానికులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన నూతన రామాలయం ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు ఆదివారం ఖమ్మంలో ఎంపీ నామా నాగేశ్వరరావును కలిశారు. నూతన ఆలయానికి కావాల్సిన గ్రానైట్ రాళ్లను ఉచితంగా అందిస్తానని చెప్పినట్లు కమిటీ బాధ్యులు తెలిపారు. ఎంపీను కలిసిన వారిలో టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు బిర్రం వెంకటేశ్వరరావు, మురళీ, హరిప్రసాద్, రాజశేఖర్ ఉన్నారు.

కోర్టు మంజూరుపై హర్షం

భద్రాచలంఅర్బన్: భద్రాచలానికి అడిషనల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు వచ్చినందుకు ఆనందంగా ఉందని భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, ప్రధాన కార్యదర్శి కొలిచలం నవీన్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ మేరకు వారు వైఎస్ ప్రెసిడెంట్ తరుణి, జాయింట్ సెక్రటరీ నర్మద, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ తిరుమలరావు, ట్రెజరర్ ఎస్.సతీష్ తదితరులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు.

ఉరి తాళ్లతో నిరసన

దమ్మపేట: మండల కేంద్రంలో తహసీల్ ఎదుట ఆదివారం నిరవధిక సమ్మెలో పాల్గొన్న మధ్యాహ్న భోజన కార్మికులు.. ఉరి తాళ్లతో నిరసన చేపట్టారు. సీఐటీయూ నాయకుడు పిట్టల అర్జున్ మాట్లాడగా.. సత్యావతి, జ్యోతి, ముత్యాలు, శ్రీలత, జయ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



బూర్గంపాడు: లక్ష్మీపురంలో సీసీ రోడ్డు, డ్రైయినేజీని ప్రారంభిస్తున్న విప్ రేగా కాంతారావు

బూర్గంపాడు: మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, మోరంపల్లిబంజర, వేపలగడ్డ, లక్ష్మీపురం, ముసలిమడుగు, కృష్ణసాగర్ గ్రామాల్లో రూ.80లక్షల ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న ఏడు బస్‌షెల్టర్లకు ఆదివారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. లక్ష్మీపురం నుంచి టేకులచెరువు వెళ్లే రహదారికి ఇరువైపులా రూ.1.20 కోట్ల ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన డ్రైయినేజీ సిస్టంను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా రూ.3 కోట్ల ప్రభుత్వ నిధులతో లక్ష్మీపురం నుంచి టేకులచెరువు వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అంజనాపురం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లను ప్రభుత్వ విప్ ప్రారంభించారు. మోరంపల్లిబంజరలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. సారపాకలో కాపు సంక్షేమ భవనానికి ఆయన భూమి పూజ చేశారు. ఆయా కార్యక్రమాలలో ఆయన మాట్లాడుతూ.. మౌలికవసతుల కల్పనకు ఐటీసీ అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. కార్యక్రమాల్లో ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ సిద్ధార్థ మొహంతి, శ్యామ్‌కిరణ్, చెంగలరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సర్పంచ్‌లు భూక్యా శ్రావణి, కొయ్యల పుల్లారావు, తుపాకుల రామలక్ష్మి, భూక్యా దివ్యశ్రీ, భూక్యా భారతి, సొంపాక నాగమణి, కుర్సం వెంకటరమణ, కొడిమె వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ముస్లిం మైనార్టీ మహిళలకు ప్రభుత్వం ఉచితంగా అందించిన 89 కుట్టు మిషన్లను విప్ రేగా కాంతారావు పంపిణీ చేశారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చేపలమార్కెట్ ఏరియాలో రూ.30లక్షలతో నిర్మించబోయే పూసల సంఘం కమ్యూనిటీ హాల్, విటల్‌రావునగర్‌లో రూ.25 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటి హాల్ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.2కోట్లతో నాయుడుకుంట బండ్ వద్ద సీసీ రోడ్లు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ పనులకు, రూ.50లక్షలతో చేపట్టబోయే శివలింగాపురం శివాలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే భగత్‌సింగ్‌నగర్, కాళిమాత ఏరియా, ఆటోనగర్, పూలమార్కెట్ సెంటర్ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, సర్పంచులు బచ్చల భారతి, బొగ్గం రజిత, ఎంపిడిఓ చంద్రమౌళి, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల మైత్రి పండుగలో విప్..

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ద కాలనీ గ్రామం సీఎస్ఐ చర్చిలో ఆదివారం జరిగిన స్త్రీల మైత్రి పండుగ వేడుకలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొన్నారు. పాస్టర్లు, స్థానికులు ఎమ్మెల్యే రేగాను శాలువాతో ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మాజీ మండల అధ్యక్షుడు కందుల కృష్ణార్జున్‌రావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, గద్దల రామకృష్ణ, కాలువ సంసోన్, మేకల భాస్కర్, అన్నపూర్ణ, జూపల్లి కిరణ్, పాస్టర్లు, స్థానికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



చర్ల: కుదునూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య

చర్ల: భద్రాచలం ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొదెం వీరయ్య ఆదివారం చర్ల మండలంలోని పలు గ్రామాకల్లో పర్యటించారు. ఆయన ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. లింగాపురంపాడు, మొగళ్లపల్లి, విజయకాలనీల్లో వివిధ కారణాలతో మృత్యువాత పడిన నాయకుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని, అప్పుడు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ పాలనలో వారి పార్టీల నాయకులకే పథకాలు అందుతున్నాయని విమర్శించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాతం, టీపీసీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యురాళ్లు మడకం పద్మ, ముత్యాల స్వాతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లపు దుర్గాప్రసాదరావు, మండల అధ్యక్షులు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు

దుమ్ముగూడెం: మండలంలోని నారాయణరావుపేట, రామచంద్రునిపేట, నడికుడి, గ్రామపంచాయతీలో వివిధ పార్టీలకు చెందిన 300ల కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీలోకి ఆదివారం ఎమ్మెల్యే పొదెం వీరయ్య సమక్షంలో చేరారు. నల్లపు దుర్గాప్రసాద్, లంకా శ్రీనివాసరావు, కనుబుద్ధి దేవా, మారయ్య, లంకా శివకుమార్, పిలక వెంకటరమణారెడ్డి, దర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ



పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరామ్మూర్తి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న గొర్రెల యూనిట్‌లను మండలంలోని గుర్రాల చెరువు గ్రామంలో ఆదివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్నా ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ.. గుర్రాల చెరువు గ్రామ పంచాయతీకు 17 యూనిట్‌లు మంజూరైనట్లు తెలిపారు. ఈ గొర్రె పిల్లలను జాగ్రత్తగా పెంచుకుని లబ్ధిదారులు ఉపాధితోపాటు, ఆర్థికంగా బలపడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కలపాల దుర్గయ్య, మండల పశు వైద్యురాలు స్వప్న, సిబ్బంది మాథర్, బాబ్జీ, గ్రామస్తులు గోపాలకృష్ణ, వీర్రాజు పాల్గొన్నారు.

బోరు నిర్మాణ పనులు ప్రారంభం..

మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి మండల పరిషత్ నిధుల ద్వారా మంజూరైన నూతన బోరు నిర్మాణ పనులను ఆదివారం ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామంలో తాటినీటి సమస్యను పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదేశాల మేరకు బోరు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చంద్రం, సతీష్ పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో వైద్యశిబిరం

చర్లరూరల్: ఏజెన్సీ ప్రాంతమైన చర్ల మండలంలోని వద్దిపేట, పూసుగుప్ప గ్రామాల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 134 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. వారికి కావలసిన మందులను పంపిణీ చేశారు. చర్ల మండలంలో 8 శిబిరాలను ఏర్పాటు చేశామని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యస్‌యల్ కాంతారావు, వైద్యులు తెలిపారు. ఈ శిబిరంలో డార్టక్ చంద్రప్రసాద్, డాక్టర్ సందీప్, వి.కామేశ్వరరావు యల్ టి.రవి, ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు, సూపర్ వైజర్లు మారుతి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రాచలం బ్రిడ్జిపై ట్రాఫిక్ జామ్



బ్రిడ్జిపై నిలిచిపోయిన వాహనాలు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని గోదావరి బ్రిడ్జిపై ఆదివారం దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆర్టీసీ బస్సు టైర్‌కు పంచర్ కావడంతో సారపాక నుంచి భద్రాచలం వచ్చే వాహనాలు అధిక సంఖ్యలో నిలిచిపోయాయి. దంచికొడుతున్న ఎండలో ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. టౌన్ సీఐ నాగరాజు రెడ్డి ఆధ్వర్యంలో టౌన్ ఎస్సై పీవీఎన్ రావు, ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్‌లు భద్రాచలం నుంచి సారపాక వైపు వెళ్లే వాహనాలు బ్రిడ్జి ఎక్కకుండా ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద నిలిపివేశారు. ఆపై బ్రిడ్జిపై నిలిచిపోయిన ఒక్కొక్క వాహనాన్ని కదిలిస్తూ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.